

రీ సర్వేకు సహకరించాలి : డిటి

ప్రజాశక్తి-రామాపురం

గ్రామాలలో నిర్వహిస్తున్న భూ రీ సర్వేకు గ్రామస్తులు సహకరించాలని భూ రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ కృపావతి పేర్కొన్నారు. సోమవారం నుంచి నల్లగుట్ట పల్లె రెవెన్యూ గ్రామంలో రెండో విడత రీ సర్వేను ప్రారంభించారు. గ్రామస్తులు తమ భూముల వద్ద హద్దులు చూపించి సర్వేకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డిన వైసిపి నాయకులు సూరం వెంకటసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు, చిలేకంపల్లి శివారెడ్డి, విఆర్‌ఒలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల పరిధిలోని చాకిబండలో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ రెడ్డిబాబు ఆధ్వర్యంలో భూముల రీ సర్వే ప్రారంభించారు. ఈ సర్వేలో మండల సర్వేయర్, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

గాలివీడు : మండలంలోని పందికుంట గ్రామంలో మూడు గ్రూపులతో రీ సర్వే ని ప్రారంభించామని తహశీల్దార్ జె.బాగ్యలత పేర్కొన్నారు. పందికుంట గ్రామంలో 3,300 ఎకరాలన్నాయని గ్రామ సర్వేయర్, గ్రామ విఆర్‌ఒ, గ్రామ విఆర్‌ఎ కలసి సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

సంక్షేమమేనా...!

- సంక్షేమ వసతి గృహాలు...కానరాని సౌకర్యాలు
- వర్షానికి ఉరుస్తున్నా.., కంపు కొడుతున్నా పట్టించుకోరా...?
- మరుగుకు నోచుకోని స్నానపు గదులు
- అక్కడే తినాలి, ఉండాలి, పడుకోవాలి
- ప్రభుత్వమైనా స్పందించి సంక్షేమానికి చేయూతనివ్వాలి

నాణ్యత లేని ఆహారం, నీళ్లు రాని కుళాయిలు, శిథిలావస్థకు చేరిన భవనాలు, అరకొర మౌలిక సదుపాయాలు... ఇవీ ప్రస్తుతం సంక్షేమ వసతి గృహాల్లోని పరిస్థితులు. పేద విద్యార్థులను అక్కున చేర్చుకోవాల్సిన సంక్షేమ వసతిగృహాలు.. అభద్రతకు చిరునామాగా మారాయి.

ప్రజాశక్తి-పీలేరు

గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రతి బిడ్డకూ బాగా చదువుకోవాలన్న ఆశ, ఉన్నత శిఖరాలకు ఎదగాలన్న జిజ్ఞాస ప్రతి విద్యార్థిలోనూ ఉంటుంది. తమ పిల్లలను మంచి విద్యా సంస్థల్లో చేర్చి ఉన్నత చదువులు చదివించాలన్న కోరికున్నా అందుకు కొందరి ఆర్థిక స్థితి, కుటుంబ పరిస్థితులు అనుకూలించక చివరికి సమీప పట్టణాల్లోని ప్రభుత్వ విద్యా సంస్థలను, సంక్షేమ వసతి గృహాలపై ఆధారపడతారు. అక్కడి స్థితిగతులు, వసతుల గురించిన ఆలోచన, అవగాహన వారికి ఉండదు. ఒకవేళ ఉన్నా తప్పని పరిస్థితుల్లో వాటినే ఆశ్రయిస్తున్నారు, వాటిలోనే ఆశ్రయం పొందుతున్నారు. ఇదీ నేటి సమాజంలోని పేద, సగటు మనిషి జీవనస్థితి, పరిస్థితి. పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సికె నారాయణరెడ్డి వంటి కొందరు సేవా తత్పరులు పేద విద్యార్థులకు బాసటగా దాతల సహకారంతో సంక్షేమ వసతి గృహాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత ప్రభుత్వాలు కూడా వాటి అవసరాలను గుర్తించి సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేస్తూ వాటిని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చాయి. కొన్నేళ్లుగా ఇవి నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

రాష్ట్రంలో పేద విద్యార్థుల ఉన్నత చదువులే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు కరువయ్యాయి. ఎప్పుడో నిర్మించిన హాస్టల్ గదుల్లో విద్యుత్ సరఫరా వైర్లు, స్విచ్ బోర్డులు దెబ్బతిన్నాయి. సరైన వెలుగు అందించే లైట్లుకానీ, ఉమ్మగించినప్పుడు చల్లగాలిని అందించేందుకు తగిన ఫ్యాన్లు లేవు. హాస్టల్ గదుల్లో సరైన కిటికీలు, గట్టి తలుపులూ లేవు. స్నానపు గదులకు సరైన డోర్లు లేవు. మరుగుదొడ్ల నిర్వహణ అస్సల్లేదు. సరైన డైనింగ్ హాల్స్ కరువయ్యాయి. కొన్ని హాస్టల్స్‌లో విద్యార్థులు ఉండడానికి తగినన్ని గదులు లేక డైనింగ్ హాల్లోనే ఉంటున్నారు. పిల్లలు భోంచేయడం, ఉండడం, చదువుకోవడం, పడుకోవడం అన్నీ కూడా డైనింగ్ హాల్స్‌లోనే సరిపెట్టుకుంటున్నారు. పురాతన భవనాలను తలపించే పాత సంక్షేమ వసతి గృహాల గోడలు నల్లబారాయి. వర్షం నీటితో గదుల గోడలు మరకలు అద్దుకుని వికృతంగా తయారయ్యాయి. దెబ్బతిన్న పైకప్పులు నుంచి సిమెంట్ పెచ్చులూడి పైన ఎక్కడ పడుతాయోనన్న భయంతో విద్యార్థులు బిక్కు బిక్కుమని గడిపే వారు పరిస్థితి నెలకొంది. పీలేరు డివిజన్ పరిధిలో 12 హాస్టల్స్ ఉండగా అందులో బాలికల కోసం 3, బాలురుల కొరకు 9 హాస్టల్స్ ఉన్నాయి. వాటిలో సుమారు 1,098 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. 3 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం తొమ్మిది వసతి గృహాలు కాగా, కళాశాలల విద్యార్థుల కోసం రెండు హాస్టల్స్ ఉన్నాయి. వీటిలో 8 వసతి గృహాలు మరమ్మతులకు లోనయ్యాయి. పీలేరు, రాయచోటి నియోజకవర్గాల పరిధిలోని 8 మండలాలలో 13 వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు నిర్వహిస్తున్నారు. వీటిలో 4 కాలేజ్ హాస్టళ్లు కూడా ఉన్నాయి. ఇందులో 4 హాస్టళ్లు బాలికల కోసం, 9 హాస్టళ్లు బాలురుల కోసం కాగా, వీటిలోనూ రెండు కళాశాలల బాలికల కోసం, మరో రెండు కళాశాల బాలురుల కోసం ఏర్పాటు చేశారు. వీటిలో 5 వసతి గృహాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఈ వసతి గృహాల్లో మొత్తం 1600 మంది విద్యార్థులు ఆశ్రయం పొంది చదువుకుంటున్నారు.



ఎస్‌సి బాలికల వసతి గృహంలో అధ్వానంగా ఉన్న డైనింగ్ హాల్

మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి

జిల్లా పరిధిలో 55 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. వాటిలో 43 హాస్టళ్లలో మరమ్మతు పనులు చేపట్టడం కోసం అవసరమైన రూ.13.19 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. వీటితో భవనాల పైకప్పు, విద్యుత్ వైరింగ్, స్నానపు గదులు, మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేపట్టనున్నారు. పీలేరు డివిజన్ పరిధిలో దెబ్బ తిన్న 8 వసతి గృహాల్లో కూడా మరమ్మతులు చేపట్టనున్నారు.

- జయ ప్రకాష్, ఎఎస్‌డబ్ల్యూఒ, పీలేరు

మౌలిక వసతులకు ప్రతిపాదనలు

పీలేరు, రాయచోటి నియోజకవర్గాల పరిధిలోని 8 మండలాల్లో 13 వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు ఉ న్నాయి. ఇందులో 5 వసతి గృహాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటిల్లో మొత్తం 1600 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. ప్రభుత్వ వసతి గృహాల మరమ్మతులు, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న హాస్టల్స్ స్థానంలో కొత్త వసతి గృహాల భవనాల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపాం.

- సురేష్ బాబు, ఎబిసిడబ్ల్యూఒ, పీలేరు.

మౌలిక వసతులు కల్పించడంలో విఫలం

జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమవస్థ గృహాల్లో అనేక సమస్యల మధ్య విద్యార్థుల విద్యను అభ్యసిస్తున్నారు. చాలా వసతి గృహాల్లో ఈ వర్షాకాలంలో పైపెచ్చులు ఊడి విద్యార్థులు వాట్సాప్ నీటి మధ్యలో నిద్రిస్తున్న పరిస్థితులున్నాయి. సీజనల్ వ్యాధులతో అనేక చోట్ల విద్యార్థులు దోమలు బెడద తట్టుకోలేక కిటికీలకు కనీసం తెరను కూడా ఏర్పాటు చేయడంలో అధికారులు ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని స్పష్టంగా అర్థం అవుతుంది. తక్షణమే విద్యార్థులకు మౌలిక ఏర్పాటు చేసి హాస్టల్స్‌లో ఆర్‌ఒ వాటర్ ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో విద్యార్థులకు కాంచిన మంచినీటిని ఏర్పాటు చేసే విధంగా అధికారులు మంచినీటిని ఏర్పాటు చేసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలి. సంక్షేమస్థ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో విద్యార్థుల ఎదుర్కొన్నటువంటి సమస్యలపైన ప్రత్యక్షంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు.



ఒకే హాల్లో చదువుకొని నిద్రపోతున్న ఎస్‌సి బాలుర వసతి గృహం విద్యార్థులు



పాతబడిన ఎస్‌సి బాలికల వసతి గృహం భవనం

పెట్టుబడిదారుల కోసమే విజన్-2047 : 'సిటు'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కూటమి ప్రభుత్వం చేపడుతున్న విజన్-2047 ప్రజల కోసం కాదని, కేవలం పెద్ద పెద్ద కార్పొరేట్ల కోసమే అని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ చంద్రశేఖర్, ఎ.రామాంజులు ప్రభుత్వాన్ని విమర్శించారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వైసిపి వల్ల పడ్డ ఇబ్బందులు తొలుగుతాయని ఓట్లు వేసిన ప్రజనీకాన్ని నిట్ట నిలువునా దగా చేస్తున్నారని తెలిపారు. మదనపల్లి సర్వజన ఆసుపత్రిలోని వైద్యం పేదలకు దూరం చేయడం మొదలు హార్సిలీహిల్స్ నిర్వహణ కూడా ప్రయివేట్ వారి చేతిలోకి పెట్టడడమేనని పేర్కొన్నారు. రైల్వేకోడూరు రైతుల భూములు హార్టీ కల్చర్‌కు ప్రసిద్ధి అని తెలిపారు. రేపు కార్పొరేట్ వ్యవసాయం భూములు లీజు పేరుతో కూడా రైతులను దగా చేయడానికి సిద్ధం అవుతుందని పేర్కొన్నారు. ఆ రకంగా అన్నమయ్య జిల్లా ప్రజల అభివృద్ధిని మరిచి కార్పొరేట్ల కోసం విజన్-2047 తెస్తున్నారని వాపోయారు. ఎన్నికల హామీలు సూపర్ సిక్స్ పథకాలు అమలు, సాగు, తాగునీరు, ఉపాధి, పరిశ్రమల స్థాపన వంటి వాటిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటై దాదాపు ఏడు నెలలు కావస్తున్నా ఇంత వరకు పథకాలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పేదలను మరింత బానిసలుగా మార్చేందుకు నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలు తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వైసిపికి పట్టిన గతే కూటమికి ప్రజలు బుద్ధి చెబుతారని ప్రయివేటీకరణ మానుకోవాలని లేకపోతే ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమాలను పెద్ద ఎత్తున చేపడుతామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

నిబద్ధతతో ప్రజా సమస్యలను పరిష్కరించాలి : కలెక్టర్



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన సమస్యలను నిబద్ధతతో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరు తోపాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదన్‌రావు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలోని అంశంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి అందిన సమస్యలను అశ్రద్ధ చేయరాదని సూచించారు. అత్యంత ప్రాధాన్యత, పారదర్శకతతో నాణ్యతగా సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులు రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట : డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీటవేస్తోందని డిప్యూటీ డిఇఒ శివ ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్)పై గాలివీడు రోడ్డు మార్గాన ఉన్న అర్చన విద్యాసంస్థలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు చేపట్టిన 8వ బ్యాచ్ శిక్షణా ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫౌండేషన్ అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం సమర్థవంతమైన విద్యకు మూలస్తంభాలన్నారు. పిల్లలు వారికి బాగా అర్థమయ్యే భాషలో చదువుకుంటేనే బాగా నేర్చుకుంటారని పరిశోధనలు చెబుతున్నాయన్నారు. తత్ఫలితంగా, మాతృభాషలో విద్యను ప్రోత్సహించడం గ్రహణశక్తి, ధారణను మెరుగుపరుస్తుందని, వారి మాతృభాషలో నైపుణ్యాన్ని సాధించడంతోపాటు బహుభాషా సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపు ప్రత్యేక లక్ష్యంగా ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. డైట్ ప్రిన్సిపల్ అజయ్ బాబు మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమం ఉపాధ్యాయులకు అనుభవం, సమర్థవంతమైన బోధనా విధానాలను అందించడంపై దృష్టి సారించారని చెప్పారు. ఈ శిక్షణ ప్రభావవంతమైన తరగతి గది వ్యూహాలు, వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థుల నిశ్చితార్థాన్ని పెంపొందించే మార్గాలను పెంపొందిస్తుందన్నారు. విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ శిక్షణను ఈ నెల 20 నుంచి 25 వరకు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ శిక్షణ లో జిల్లా వ్యాప్తంగా 480 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారన్నారు. అర్చన విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం ప్రాముఖ్యత అపారమన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుచున్న విద్యార్థులకు అన్ని సబ్జెక్టులలో పట్టును పెంపొందించేందుకు శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహద పడుతున్నాయన్నారు. శిక్షణ సందర్భంలో ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని వసతులను కల్పించారు. కార్యక్రమంలో డైట్ లెక్షరర్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ ఎఎంఒ సమీవుల్లా, ఎఫ్ఎల్ఎన్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్, ఐఇ కో-ఆర్డినేటర్ జనార్ధన్, మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణ, నాగార్జున, సిఆర్‌పి శ్యామల, పీడీ వీరాంజి, రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను అమ్ముతున్న రైతులు

ప్రకృతి వ్యవసాయ కూరగాయలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కూరగాయలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహశీల్దార్ పామిలేటి, ఎడిఎ వాణిశ్రీ అన్నారు. సోమవారం పట్టణంలోని వెలుగు కార్యాలయ ఆవరణంలో ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై ప్రతి సోమవారం వెలుగు కార్యాలయ ఆవరణంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కూరగాయలను రైతులు స్టాల్స్‌గా ఏర్పాటు చేసి అమ్మడం జరుగుతుందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ హేమలత, ఎపిఎం నారోత్తమ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్వాతి, పవన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్య తీసుకుంటుందని నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బిహెచ్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రాయ చోటి తాలూకా ఉద్యోగుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, తాలూకాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలన్నీ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తాలూకాలో ఉద్యోగుల సమస్యలను తెలియజేసినట్లయితే మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్ర మంలో తాలూకాలోని ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.



లక్ష్మీప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన

- టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సిఎం చంద్రబాబు నాయుడు పాలన సాగుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి అరాచక పాలనను చూసి విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు దేశంలో ఏ పార్టీకి ఇవ్వన్నటువంటి అత్యధిక సీట్లను కూటమి ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. మంత్రి లోకేష్ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి నిధులు మంజూరు, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు వెనుక చంద్రబాబు కృషి ఎంతో ఉందన్నారు. తెలుగుయువత రాష్ట్రమ అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిటి జనార్దన్‌రెడ్డి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. సమావేశంలో తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధు బాబు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మండ్యం ప్రభాకర్, నాయకులు సీడ్ మల్లికార్జున నాయుడు, రాటకొండ మధుబాబు, మండ్యం ప్రభాకర్, సురేంద్ర, సుబ్రహ్మణ్యంరెడ్డి, పూలమురళి, వెంకటశివ, మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, బాలకృష్ణారెడ్డి, కాశీ శ్రీరామ్ వాల్మీకి, పసుపులేటి శ్రీనివాసులు, తెలుగు యువత నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, అరుణ్ తేజ్, ఆయూబ్, మహబూబ్‌ఖాన్, సికిందర్, శ్రీకాంత్‌రెడ్డి, శివకుమార్, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రూ.48 లక్షలతో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌కు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.48 లక్షలతో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ భవనాల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తయారు చేసే ప్రక్రియలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధునాతన హంగులతో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ భవనాల నిర్మాణానికి రూ.48 లక్షలు నిధులు మంజూరు చేయడం శుభాపరిణామమన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని, ఇప్పటికే డైనింగ్ హాల్ నిర్మాణం దాదాపు పూర్తి చేయడం జరిగిందన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్ఎం సుబ్బారెడ్డి, ఎస్టీయు రాష్ట్ర నాయకులు ఆర్.వి రమణ, టిడిపి నాయకులు నవీన్ చౌదరి, యర్రబెల్లి వెంకటరమణారెడ్డి, డ్యాన్స్ రెడ్డెప్ప, కంచర్ల మల్లికార్జున నాయుడు, కత్తి లక్ష్మన్న, చుక్కా విజయ్ కుమార్, సురేందర్‌రెడ్డి, మల్లికార్జున, గురుమంచు, పూలకుంట్ల హరిబాబు, మంజునాథ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై దాదాపు ఏడు నెలలు కావస్తున్నా ఇంత వరకు పథకాలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందని పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తమంచూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ఆర్భాటంగా హామీలు ఇచ్చేసి, గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా విస్మరిస్తుండడం సమంజసం కాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామం నుంచి ప్రతి వైసిపి కార్యకర్త సైనికుడిలా పని చేసి, కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వైసిపి నాయకుడు సయ్యద్‌బాషా కుమారుడు సాధిక్ వివాహ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన వలీమ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు రఘు, నాగరాజ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.04 లక్షలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని తవళం గ్రామంలో వెలసిన శ్రీ నేలమల్లేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం మదనపల్లి డివిజన్ దేవాదాయ శాఖ తనిఖీ అధికారి ఎస్.శశి కుమార్, ఆలయ ఇఒ మంజుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మంజుల మాట్లాడుతూ ఆలయ హుండీని లెక్కించినట్లు తెలిపారు. ఐదు నెలలు (సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్, జనవరి)లకు హుండీ ద్వారా రూ.1,04,776 ఆదాయం ఆలయానికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని దేవాలయానికి సంబంధించిన ఇండియన్ బ్యాంక్ అకౌంట్, వాల్మీకిపురం నందు జమచేసి, ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రెడ్డప్ప, మాజీ సర్పంచ్ రాజన్న, మాజీ ఎంపిపి మేష రామకృష్ణ, ఆలయ అర్చకులు శంకర స్వామి, దేవాదాయశాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



మొదటి బహుమతి అందుకుంటున్న భువనగిరి జట్టు

క్రికెట్ విజేత భువనగిరి జట్టు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆర్.వడ్డిపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ పోటీల్లో 30 టీమ్స్ పాల్గొన్నట్లు ఆర్గనైజర్స్ తెలియజేశారు. ఈ నెల 10వ తేదీన ప్రారంభమైన ఈ క్రీడా సంబరాలు ఫైనల్‌తో ముగిసినట్లు పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో భువనగిరి లెవన్స్, కమల్ లెవన్స్ మధ్య మ్యాచ్ జరగగా మొదట బ్యాటింగ్ చేసిన భువనగిరి లెవన్స్ 12 ఓవర్లలో 153/9 చేయగా తదు పరి కమల్ లెవన్స్ టీం 11 ఓవర్లలో 92 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ హోరాహోరీ మ్యాచ్‌ల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన మణికంఠ (41) క్రీడాకారుడికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. విశ్వ విజేతగా నిలిచిన భువనగిరి 11 జట్టుకు మొదటి బహుమతిగా రూ.30 వేలు, రన్నరప్‌గా నిలిచిన కమల్ లెవన్స్ టీంకి రూ.15 వేలు భువనగిరి చిన్న రెడ్డయ్య రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ క్రీడా పోటీల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహించిన ప్రతి ఒక్కరికి చిన్న రెడ్డయ్య రెడ్డి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఎంఇఒగా కోదండ నాయుడు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండల విద్యాశాఖ అధికారిగా ఎ.కోదండ నాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కోడూరు ఎంఇఒగా పోతురాజు రామయ్య గత నెల ఉద్యోగ విరమణ చేపట్టగా ఆ స్థానంలో చిట్వేలి మండలంలో ఎంఇఒగా పనిచేస్తున్న కోదండ నాయుడు బదిలీపై కోడూరు ఎంఇఒగా నియమితులయ్యారు.

మాతమ్మ తల్లి గుడి ప్రారంభం

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని గురప్ప గారిపల్లె గ్రామం సందేగారి పల్లెలో వెలిసిన మాతమ్మ తల్లి గుడిని టిడిపి రాజంపేట ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, తాటికుంట్ల శ్రీధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. తుమ్మల రాములయ్య, అమ్మని ఆహ్వానం మేరకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా గుడిలో అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో వీరనాగిరెడ్డి, నాగార్జున నాయుడు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం కేసులో వ్యక్తికి 14 రోజులు జైలుశిక్ష

ప్రజాశక్తి-పుల్లంపేట

మద్యం తాగి వాహనం నడిపిన కేసులో మండలంలోని ఈడిగపల్లె గ్రామానికి చెందిన పోలా సుబ్బరాయుడుకు రాజంపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి సోమవారం 14 రోజులు జైలు శిక్ష విధించారు. రూరల్ సిఐ మహమ్మద్ అలీ కథనం మేరకు ఈనెల 10వ తేదీన తన సిబ్బందితో మన్నూరు సుదర్శన్ థియేటర్ దగ్గర వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో పోలా సుబ్బరాయుడు మద్యం సేవించి వాహనం నడుపుతూ తనిఖీలో పట్టుబడ్డారని ఆయన తెలిపారు. ఎవరైనా మద్యం తాగి పట్టుపడితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని వాహనదారులకు తెలియజేశారు.

ఇడిఎ టూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లు సమీపంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్‌లో సెమీకండక్టర్ తయారీకి ఇడిఎ సాధనాల ఆచరణాత్మక ఉపయోగం అను అంశంపై ఐదు రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. వర్క్‌షాప్‌ను ప్రతిష్టాత్మకమైన ఐఇఇఇ వారు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన సీనియర్ అప్లికేషన్ ఇంజినీర్, డిజైన్, సపోర్ట్, ఎంట్‌ఫుల్ టెక్నాలజీస్ నవనీతకృష్ణన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు, అకడమిక్స్‌కి మధ్య అంతరంను తగించడానికి, పరిశ్రమల సమస్యలపై రీసెర్చ్ ద్వారా పరిష్కరించి సరైన ఆలోచనలతో ముందుకెళ్ళి, మంచి ఫలితాలను రాబట్టడానికి ఇటువంటి టూల్స్ ఎంతగానో ధోహద పడతాయని పేర్కొన్నారు. ఇటువంటి అడ్వాన్స్ డ్ టూల్స్ కొనుగోలు చేసి పీజీ స్టూడెంట్స్ పరిశోధనలు అతిత్వరగా పూర్తి చేయుటకు మంచి అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీప్రపంచంలో సాఫ్ట్వేర్ ఉద్యోగాలు లతో పోలిస్తే ఇసిఇ విభాగం విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా విఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్ పై మెండుగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫ్యాబ్ సిటీస్ మంజూరు చేసారని, అవ్వని నిర్మాణ దశ లో ఉన్నాయని త్వరలో అవి అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. విఎల్ఎస్ఐ ఇడిఎ టూల్స్‌పై మనం అవగాహన పెంచుకొని, పరిశోధనలు చేయాలన్నారు. ప్రస్తుతం ఏ ఫ్యాబ్రికేషన్ కి అయినా మనం ఇంటెల్ కంపెనీ పై ఆధారపడి ఉన్నాం అని అన్నారు. మన ఇండియాలో కొత్త టెక్నాలజీ కి సరైన అవగాహన లేధని ఇటు వంటి వర్క్‌షాప్‌లకు హాజరవడం వల్ల ఇండస్ట్రీలో జరుగుతున్న పరిశోదనలను విద్యార్థులు తెలుసుకొని తధ్వర అధునాతన సాధనాల తో నూతన పరిశోధనలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్, కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగ జ్యోతి, డాక్టర్ నాగశ్వేత, చరన్, తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న నవనీత కృష్ణ

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులు గ్రామాలలో నిర్వహించే ఉచితపశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సుద్దమల్ల పంచాయతీ మంగళపల్లి దూదేకులపల్లిలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 1526 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తపించారు. 57 ఆవులు గేదలకు, 25దూడలకు చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న పథకాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. పాడి రైతులకు గోకులాలు, గొర్రెల పెంపకం దారులకు ఇస్తున్నటువంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు పశువుల పాకలు, గొర్రెలదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గొర్రె, పశువులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వాటిని పశువుల మంద నుంచి వేరు చేసి పక్కనుంచాలని పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో చలి వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వాటిని చలి బారి నుండి కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెవిఒ రేవతి, జెఎల్ఒ ఈశ్వర్ రెడ్డి విఎ గణేష్, పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

వీరబల్లి : మండలంలోని డి. రాచపల్లి పంచాయతీ బలిజపల్లెలో సోమవారం పశువైద్యాధికారి నాగరాజు పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువుల ఆరోగ్యం పర్యవేక్షణ బాధ్యత గ్రామాల్లో ఉండే వెటర్నరీ అసిస్టెంట్లు చూసుకోవాలి అన్నారు. పశువులు, గొర్రెలు, మేకలకు సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామని ఆయన అన్నారు. పశువులకు ఎలాంటి దాన అందించాలో రైతులకు సూచించాలని పేర్కొన్నారు. రైతులు కూడా విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లకు సహకరించాలని ఆయన కోరారు. ఈ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గర్భ కోశ చికిత్సలు, కృతిమ గర్భధారణ, ఆవులు, గేదెలు, దూడలు, గొర్రెలు, మేకలలో నట్టల నివారణ మందులు తాపించామన్నారు. కార్యక్రమంలో పశు వైద్య అధికారి డాక్టర్ నాగరాజు, విఎల్ఒ జయ ప్రకాష్, వెటర్నరీ అసిస్టెంట్ గణేష్, శశాంక్, గ్రామస్తులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** పాడి రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి భాగ్యవతి తెలిపారు. నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో మందరం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి, రాచపల్లి, గొల్ల పల్లి, మందరం ఎస్‌టి కాలనీ, తదితర గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందరం, పులపత్తూరు గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాలలో గొర్రెలు, గేదెలు, మేకలు తదితర 3700 పశువులకు నట్టల నివారణ టీకాలు వేశామని తెలిపారు. కార్యక్రమం ఈనెల 30 వరకు ప్రతి గ్రామాలలోనూ నిర్వహిస్తామని చెప్పారు.పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల పరిధిలోని కలిబండ, బలిజపల్లె గ్రామాల్లో పశు వైద్యాధికారి డాక్టర్ గణేష్ ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వ హించారు. ఈ ఉచిత పశు వైద్య శిబిరాలలో 189 పశువులకు, 120 పాడి ఆవు దూడలకు, 1200 గొర్రెలకు నులి పురుగుల టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో రైతులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాయే రాష్ట్రానికి సంజీవని : పిసిసి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విభజనతో ఆర్థికంగా కుదేలైన ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమవుతుందని పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్, మదనపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. సోమవారం పాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగాలైనా, పరిశ్రమలైనా, పన్నురాయితీలైనా ప్రత్యేకహోదాతోనే సాధించగలమని పేర్కొన్నారు. టిడిపి, జనసేన ఎందుకు ఆలోచించలేదని, విభజన సమయంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పార్లమెంటు సాక్షిగా ఎపికి ఐదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారని దీన్ని సమర్థించిన నాటి ప్రతిపక్షమైన బిజెపి ఐదేళ్లు కాదు, పదేళ్లు ఇవ్వాలని పట్టుబట్టిందని గుర్తు చేశారు. ఆ విధంగా కాంగ్రెస్, బిజెపిలు రెండూ కలిసి రాష్ట్రాన్ని విభజించిన విషయం అందరూ తెలిసిందే అన్నారు. ప్రత్యేక హోదా వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని, మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇస్తున్న నిధుల్లో 30 శాతం నిధులను మొదట ప్రత్యేకహోదా కలిగిన రాష్ట్రాలకే పంచుతారని, ఆ తర్వాతే మిగిలిన 70 శాతం నిధులను ఇతర రాష్ట్రాలకు అందిస్తారని చెప్పారు. ప్రత్యేకహోదా ఉన్న రాష్ట్రాలకు కేంద్ర నిధులు 90 శాంతం గ్రాంట్లు గాను, 10 శాతం అప్పుగాను వస్తాయని గ్రాంట్ల ద్వారా వచ్చిన సొమ్మును తిరిగి చెల్లించనక్కర్లేదని, రుణం ద్వారా అయితే తిరిగి చెల్లించాల్సి ఉంటుందని, ప్రత్యేకహోదా ఉన్న రాష్ట్రాల్లోని పరిశ్రమలకు భారీగా రాయితీలు ఇస్తారని వారు తెలియజేశారు.100 శాతం ఎక్సైజ్ డ్యూటీ మినహాయింపు లభిస్తుంది. ఇన్ కమ్ ట్యాక్స్‌లో కూడా 100 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. ప్రత్యేక హోదాతో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వస్తాయని లక్షల



మాట్లాడుతున్న అల్లాబకాష్

సంఖ్యలో ఉద్యోగఅవకాశాలు సమకూరుతాయని తెలిపారు. పదేళ్ల ప్రత్యేక హోదాతో ఎపిలోని 13 ఉమ్మడి జిల్లాలు ఒక్కో హైదరాబాదుగా మారతాయని, అప్పుడు ఎవరూ ఉద్యోగాల కోసం వెతుక్కోవాల్సిన పనిలేదని ప్రతికంపెనీ నిరుద్యోగుల కోసం వాంటెడ్ బోర్డులు పెట్టేస్తాయని వివరించారు. గతంలో జగన్మోహన్ రెడ్డి కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని ప్రజలకు మాట ఇచ్చి మరిచి మోడీ చేతులో కీలుబొమ్మగా మారి చివరికి 11 సీట్లకే పరిమితమైన విషయం టిడిపి, జనసేన అగ్ర నాయకులు తెలుసుకోవాలన్నారు. బాబు, పవన్ మోడీ చేతిలో కీలు బొమ్మలుగా మారకుండా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పోరాడితే పోయేదేముంది?, పోరాడకపోతే భవిష్యత్తులో జగన్ కు పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'ఆక్రమణలో దేవుడి మాన్యం భూమి'


మాట్లాడుతున్న వేపూరుకోట గ్రామస్తులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వందేళ్ల క్రితం పూర్వీకులు దేవుడి మాన్యం కింద ఇచ్చిన భూమి ఆక్రమణలో ఉందని దానిని వెంటనే దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టాలని పోతబోలు పంచాయతీ కురవపల్లి గ్రామస్తులు సోమవారం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వెంకటరమణ, పెద్ద రెడ్డప్ప, నాగరాజు, ధనంజయ మాట్లాడుతూ గ్రామంలోని 606/బి సర్వే నెంబర్‌లో 6.5 ఎకరాల భూమిని కురబస్వామి దేవాలయానికి మాన్యం భూమిగా వందేళ్ళ క్రితం పూర్వీకులు కేటాయించారన్నారు. గ్రామంలో ఈ భూమిని ఎవరు సాగు చేసుకున్న ఆలయ నిర్వహణ కోసం గుత్త చెల్లించేవారన్నారు. ప్రస్తుతం ఆలయానికి చెందిన భూమిని ఎండోమెంట్ స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. గ్రామానికి చెందిన తిమ్మయ్య కుటుంబీకులు పాలంకొండ వెంకటరమణ, నరసింహులు మరికొందరు కలిసి ఆలయ మాన్యాన్ని ఆక్రమించుకొని తమదని బుఖాయిస్తున్నారన్నారు. పలుసార్లు తహసిల్దార్‌ను ఆశ్రయించిన పట్టించుకున్న దాఖలాలు లేవని తెలిపారు. వెంటనే ఆలయ భూమిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని సబ్ కలెక్టర్ ను కలిసి వినతిపత్రం ఇచ్చామని, త్వరలోనే విచారణ జరిపిస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆశ్రమ భూమి ఆక్రమణ : మొలకలచెరువు మండలం వేపూరు కోటలో ఆదినారాయణ ఆశ్రమానికి ప్రసాద్ అనే వ్యక్తి రెండు ఎకరాల భూమిని రాసిచ్చినట్లు ఆశ్రమ నిర్వాహకులు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. సగం తన చెల్లెలు గిరిజ పేరిట కూడా రాయడంతో ఆమె మొత్తం భూమిని మరొకరికి విక్రయించిందన్నారు. ఆశ్రమ భూమి ఆశ్రమానికి దక్కేలా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్‌కు విన్నవించినట్లు వేపూరుకోట గ్రామస్తులు తెలిపారు.

లోకేష్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కోరడం హాస్యాస్పదం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు డిప్యూటీ సిఎం పదవి ఇవ్వమని కొందరు టిడిపి నాయకులు సిఎంను అడగడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి తప్పుపట్టారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పదవి ఆరోవేలు వంటిదని, అడ్డమే తప్ప ఉపయోగం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి, భారత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి అన్నారని తెలిపారు. భారత రాజ్యాంగంలో ముఖ్యమంత్రి, మంత్రుల ప్రస్తావన ఉందేకానీ, ఉప ముఖ్యమంత్రి లేదన్నారు. రాజ్యాంగంలో 164 అధికరణ, క్లాజ్ (1) ప్రకారం గవర్నర్ ముఖ్యమంత్రిని నియమిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి సలహా మేరకు మంత్రులను గవర్నర్ నియమిస్తారని తులసిరెడ్డి వివరించారు. ఉప ముఖ్య మంత్రి పదవికి ప్రోటోకాల్ ఉండదన్నారు. అదనపు అధికారాలు, హక్కులు, బాధ్యతలు లేనందున ప్రమాణ స్వీకారం కూడా ఉండదని తెలిపారు. పవన్ కల్యాణ్ కూడా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారే తప్ప ఉప ముఖ్యమంత్రిగా చేయలేదన్నారు. లోకేష్ మీద ప్రేమ, ఆయన పరిపాలనా సామర్థ్యం మీద అంత నమ్మకం ఉంటే టిడిపి నాయకులు ముఖ్యమంత్రి పదవి ఇవ్వమని అడ గాలని సూచించారు. పవన్‌ను తగ్గించాలనుకుంటే ఆయనకు ఉన్న డిప్యూ టీ సిఎం పదవి ఊడ పీకాలని చెప్పారు. సిఎం పదేపదే స్వర్ణాంధ్ర, సంతోష, ఆరోగ్య, సం పద ఆంధ్ర అంటున్నారని, ముందు ఆయన సొంత జిల్లాలో, సొంత నియో జకవర్గం కుప్పంలో ఏనుగుల బెడద నుండి ప్రజలను రక్షించాలని కోరారు.

కడప 'ఉక్కు' కోసం నిరంతర పోరాటాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి నిరంతర పోరాట కార్యక్రమాలు తప్పవని డివైఎఫ్ఐ మాజీ నాయకులు సత్యనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కడప ఉక్కు పరిశ్రమ దుస్థితి మారడం లేదన్నారు. పాలకుల హామీలు నీటిమీద రాతలు లాగానే మిగిలిపోతున్నాయే కానీ, కడప ఉక్కు పరిశ్రమకు అడుగులు ముందుకు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం కరువుతో అల్లాడుతున్న రాయలసీమకు సంజీవని కడప ఉక్కు అని అన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు. అనంతరం ప్రొద్దుటూరు పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మేరి కుమార్, కార్యదర్శిగా విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, సభ్యులుగా చిన్న, సుబ్బారావు, రమేష్, పక్కిరయ్య ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మెరి కుమార్, విశ్వనాథ్ మాట్లాడుతూ తమపై నమ్మకముంచి బాధ్యతలిచ్చిన జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

సరైన ధ్రువపత్రాల్లేకపోతే జరిమానా

ప్రజాశక్తి - వేముల

స్థానిక కడప-పులివెందుల ప్రధాన రహదారి గొందిపల్లె క్రాస్ వద్ద సోమవారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. ముందుగా వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సరైన ధ్రువపత్రాల్లేని వాహన యజమానులకు చలానా విధించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.


విసికి ఒప్పంద పత్రాలు అందజేస్తున్న కేతు శశికాంత్

వైవీయూకు ఆచార్య 'కేతు' కుటుంబం వితరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

వైవీయూ తెలుగు శాఖలో ప్రతిభావంతులకు ప్రతి ఏటా కేతు విశ్వనాథరెడ్డి పేరిట స్మారక బంగారు పతకం, నగదు బహుమతి అందించేందుకు ఆయన కుమారుడు కేతు శశికాంత్ రూ.3.5 లక్షల చెక్కులను విసి ఆచార్య కె. కృష్ణారెడ్డికి అందజేశారు. ఈ మేరకు సోమవారం విసి సమక్షంలో విద్యాలయ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, కేతు శశికాంత్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం చెక్కులను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రఖ్యాత విద్యావేత్త, ప్రముఖ రచయిత, సాహిత్య విమర్శకుడు, అధ్యయనశీలి తెలుగు సాహిత్య, సాంస్కృతిక అధ్యయనశీలి ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి పేరిట అవార్డు నెలకొల్పడం సంతోషదాయకమన్నారు. సాంస్కృతిక వారసత్వానికి బలమైన పునాది వేసిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి చిరస్మరణీయుడన్నారు. మాతృ భాషను, ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. యూనివర్శిటీలోని తెలుగు విభాగంలోని విద్యార్థుల్లో అకడమిక్ ఎక్సలెన్స్‌ను గుర్తించి రివార్డ్ చేయడం గోల్డ్ మెడల్ లక్ష్యమన్నారు. అవార్డు, నగదు బహుమతితో పాటు, భాషాభివృద్ధికి ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఆచార్య రఘునాథ రెడ్డి మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి చేసిన అమూల్యమైన కృషి ,చెరగని ముద్ర వేసిందని, భావి తరాలకు పండితులకు, రచయితలకు స్ఫూర్తినిస్తుందన్నారు. ప్రొఫెసర్ కేతు విశ్వనాథ రెడ్డి కుటుంబ సభ్యులు కేతు పద్మావతమ్మ (భార్య), కేతు శశికాంత్ (కొడుకు), కేతు మాధవి (కుమార్తె), శిరీష (కుమార్తె)ను వారు అభినందించారు. ఈ సందర్భంగా కేతు శశికాంత్‌ను సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య ఎ.జి.దాము పాల్గొన్నారు.

వేలూరు భారతికి డాక్టరేట్

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధకులు వేలూరు భారతికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసింది. వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు టి.రామప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో 'ఒక శతాబ్దపు రాయలసీమ కథానిక-స్త్రీ (1926 నుంచి నేటి వరకు)' అనే అంశంపై ఈమె చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన భారతి అధ్యాపకురాలిగా పనిచేస్తూ పార్టుటైమ్ పిహెచ్‌డి. పరిశోధన చేశారు. పరిశోధనలో భాగంగా ఈమె రాసిన పరిశోధన పత్రాలు పలు జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా విశ్వవిద్యాలయ విసి. ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ,వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య యస్. రఘునాథరెడ్డి, తెలుగుశాఖ ఆచార్యులు, పరిశోధకులు భారతిని అభినందించారు.

నైట్ ల్యాండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుకు నైట్ లాండింగ్ పనులను పూర్తి చేయాలని రాయలసీమ అంతర్జాతీయ విమానాశ్రయ సాధన సమితి వ్యవ స్థాపక అధ్యక్షులు మాస్ మస్తాన్, ఎన్ఆర్ఐ మైనార్టీ ఉపాధ్యక్షులు రహమతుల్లా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ ఆధ్వర్యంలో జెసి అధితి సింగ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమా ప్రజలు బతుకు దేరువు కోసం గల్ఫ్ లాంటి విదేశాలకు వెళ్లాలంటే పక్క రాష్ట్రంలోకి చేరుకుని ఎయిర్ పోర్ట్ వెళ్లి ప్రయాణం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. అది దూర ప్రయాణంగా ఉందని తెలిపారు. అలా కాకుండా రాయలసీమ ప్రజల కోసం కడప జిల్లా ఎయిర్ పోర్టులో నైట్ లాండింగ్ పూర్తి చేస్తే మన రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు ప్రయాణం చేస్తారని, ప్రయాణలు దగ్గరగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ కడప జిల్లా ఉపాధ్యక్షులు లోకేష్, నాయకులు విశ్వనాథ్, రాఘవ,ఇర్ఫాన్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

చెస్ టోర్నీలో జిల్లాకు విశిష్ట గౌరవం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లాకు జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌లో విశిష్ట గౌరవం లభించింది. కర్నూలు నగరంలోని భాష్యం స్కూల్, బాలాజీ నగర్ వద్ద జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంట్‌లో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన 23 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో కడప జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అద్భుత విజయాలు సాధించారు.ఈ టోర్నమెంట్‌లో డీ. అష్రఫ్ సుభాని ఫస్ట్ ప్రైజ్‌గా రూ. 10 వేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. టి. శ్రీకాంత్ 8వ స్థానం సాధించి రూ.1,500 నగదు బహుమతి పొందారు. సీనియర్స్ కేటగిరీలో అనీస్ దర్బారి మొదటి స్థానంలో నిలిచారు. రూ.1,000 నగదు బహుమతి గెలుచుకున్నారు.

ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ కేలండర్‌ను రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ లక్ష్మీ నరసమ్మ, సంఘం అధ్యక్షులు డాక్టర్ ఫరూక్, కార్యదర్శి డాక్టర్ సుబ్బారాయుడు, సభ్యులు డాక్టర్ యు.శ్రీనివాస్, డాక్టర్ యాదవేంద్ర రెడ్డి, డాక్టర్. బాలాజీ, డాక్టర్ స్వామిదాస్, డాక్టర్ షాహిద్, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా కె.చిన్నపరెడ్డి

ప్రజాశక్తి - కడప



రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా కడపకు చెందిన కె. చిన్నపరెడ్డి ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో ఈనెల 19న రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో హ్యాండ్ బాల్ రాష్ట్ర అసోసియేషన్ నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎలమంచి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణరాజు ఉపాధ్యక్షులుగా కడపకు చెందిన కె. చిన్నపరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చిన్నప్పరెడ్డి ఎన్నిక కావడం పట్ల కడప జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి.వి.శివప్రసాద్, అసోసియేషన్ సభ్యులు, హ్యాండ్ బాల్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ చిన్నపరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎడిపై స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

గరంలో గుర్తింపు లేని ఎడిఫై స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జగదీష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో కడప పట్టణంలోని గుర్తింపు లేకుండా ముందస్తు అక్రమ అడ్మిషన్లపై డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్రాస్ రోడ్డులో అమర స్వామి కాంప్లెక్స్ లోనీ ప్రయివేటు బిల్డింగ్‌లో అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలోని రాయచోటి రోడ్డు బుగ్గలేటి పల్లెలో గుర్తింపు లేని నిర్మాణంలో కడప జిల్లా ఎడిఫై ప్రయివేట్ పాఠశాల అడ్మిషన్ల పేరుతో వేల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రులతో రాబడుతున్నారని చెప్పారు. కడప జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్య హక్కుచట్ట ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలలు మాత్రమే అడ్మిషన్లు చేసుకోవాలని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని చెప్పారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, పీలేరు

O.S.No. 78 OF 2017

బంధం మదనమోహన్. ...వాది

Vs

గుండ్లూరి యల్లమ్మ (died) మరియు ఇతరులు.

...ప్రతివాదులు

3వ ప్రతివాదికి దావా సమను

3వ ప్రతివాది:
జి.సురేష్‌బాబు, S/o నాగయ్య, నివాసము : డోర్‌నెం.2-257/1, జి.వి.నగర్, పీలేరు టౌన్, పోస్ట్ & మండలం, అన్నమయ్య జిల్లా.

పై వాది దాఖలు చేసిన పై దావాలోని హాజరు నిమిత్తమై 06.02.2025వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని కోర్టులో 06.02.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

//By Order of Court//

ఎమ్.భవానీ శంకర
న్యాయవాది, పీలేరు.

మదనపల్లె పురపాలక సంఘము

ఈ-ప్రొక్యూర్మెంటు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.553/F1/2020 తేది: 20.01.2025

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకు గాను ఈ-ప్రొక్యూర్మెంటు ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

వ. నెం	నిధులు	టెండర్ ఐ.డి.లు	పనుల సంఖ్య	పని అంచనాల మొత్తము (ECV)
1	పురపాలక సాధారణ నిధులు	780965	1	రూ. 9,64,308.00

పై పనులకు సంబంధించిన పూర్తి వివరముల కొరకు వారి e Procurment market place నందు చూడవలెను మరియు ఆఫీసు పనివేళలలందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.
బిడ్ డాక్యుమెంటు డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 21.01.2025 : 11.00 AM
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివర తేది : 28.01.2025 : 11.00 AM
బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివర తేది : 28.01.2025 : 11.15 AM
షరతులు : ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దపరచుటకు/ నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

కమీషనరు
మదనపల్లె పురపాలక సంఘము.